క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు నేలమట్టం



అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

పటాన్‌చెరు : అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అమీన్‌పూర్ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నం.630లో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌ను జేసీబీ సహకారంతో తొలగించారు. అలాగే సర్వే నం.993లో అక్రమంగా నిర్మించిన పది రేకుల షెడ్లను తొలగించామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే, చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావుతో పాటు ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తిలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ రమేశ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. తాపీ మేస్త్రీలతో మాట్లాడి పనుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి పరిశ్రమల ప్రతినిధులను కోరారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువన్నారు. యంత్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల వద్ద మంటలు చెలరేగుతాయని, గాలి వెలుతురు బాగా వచ్చేలా చూడాలన్నారు. మంటలు అదుపు చేసేందుకు వాడే పరికరాలు పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ.శివలింగం, డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంబీఏకు ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ అక్రిడిటేషన్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం, రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సిగలో మరో కలికితురాయి చేరింది. స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) కోర్సుకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ), న్యూఢిల్లీ మంజూరు చేసినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించాయి. ఈ గుర్తింపు జూన్ 30, 2028 వరకు మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని తెలిపారు. ఎంబీఏ అధ్యాపకులు, అక్రిడిటేషన్ బృందాలను ఐక్యూఏసీ, అక్రిడిటేషన్ అండ్ ర్యాంకింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మంజునాథా చారి అభినందించారని తెలిపారు.

కనీస వేతనం 18వేలు ఇవ్వాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని ఆత్మకూర్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు స్వరూప, యశోద, లావణ్య, మాధవి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దంచికొడుతున్న ఎండలు



చున్నీ వేసుకొని వెళ్తున్న యువతి



గొడుగు ధరించి స్కూటీపై వెళ్తున్న ఫ్యామిలీ



బాబు తలకు టవల్ కట్టి తీసుకెళ్తున్న తండ్రి

ఈ సారి మార్చిలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ప్రజలు వేడి భరించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించాడు. పదకొండు గంటల తరువాత జనం బయటకు రావటానికి జంకుతున్నారు. పురుషులు నెత్తిన టోపీ, రుమాలు ధరించి ప్రయాణిస్తున్నారు. మహిళలు స్కార్ఫ్ ధరించి వెళ్తున్నారు. స్కూల్ పిల్లలు ఇంటికి వెళ్లే క్రమంలో వేడికి తట్టుకోలేక గొడుగు పెట్టుకొని వెళ్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



ముఖానికి స్కార్ఫ్ కట్టుకొని వెళ్తున్న యువతి



రుమాలు కట్టుకొని బైక్ పై వెళ్తున్న వాహనదారుడు



గొడుగు పెట్టుకొని ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం



నారాయణఖేడ్ సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద భోగ్‌బండార్ నిర్వహిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మాజీమంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావుపై నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును కోర్టు కొట్టివేయడం పట్ల శుక్రవారం ఖేడ్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు, భోగ్ భండార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్ మాట్లాడుతూ... హరీశ్‌రావు తెల్లకాగితం లాంటివారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా ఆయనపై అక్రమంగా కేసు నమోదు చేయించిందని మండిపడ్డారు. ధర్మం ఆయన వెంట ఉన్నందునే కేసును కోర్టు కొట్టివేసిందని తెలిపారు.

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి టౌన్ : న్యాయపరమైన విషయాల్లో అందరికీ ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో వివిధ సంఘాల నాయకులతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాలు, మతాల వారీగా వారి కమ్యూనిటీని నిర్మించుకొని అందులో పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేయకుండా, ఎక్కువ మొత్తంలో కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టులో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌డీఓకు వినతి పత్రం అందిస్తున్న వీఓఏలు

సంగారెడ్డి జోన్: గ్రామాల్లోని మహిళా సంఘాల్లో విధులు నిర్వహించే తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్తున్నట్లు, ఆరోజు విధులకు హాజరు కాబోమని శుక్రవారం అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ. 20 వేలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

నారాయణఖేడ్ /మునిపల్లి(అందోల్)/కంగ్టి(నారాయణఖేడ్) : వ్యవసాయ శాఖ ద్వారా 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గాను రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించేందుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించినట్లు మండలాల వ్యవసాయ అధికారులు తెలిపారు. పట్టా పాసుపుస్తకం కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళలు మాత్రమే అర్హులని ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, జనరల్ వారికి 40 శాతం రాయితీ అందిస్తున్నామని, రూ.లక్ష లోపు లబ్ధి పొందే వారికి కనీసం ఎకరం లోపు వ్యవసాయ భూమి కలిగి ఉండాలన్నారు. మునిపల్లి మండలంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య తెలిపారు. మండల కమిటీ సమక్షంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఎంఈవోకు అందజేయాలని సూచించారు. కంగ్టి మండలంలో పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, మహిళా రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు వ్యవసాయాధికారి హరీశ్ పవార్ తెలిపారు. దరఖాస్తులను సంబంధిత ఏఈఓలకు లేక ఏఓ కార్యాలయంలో అందజేయాలని ఏఓ సూచించారు. పైన తెలిపిన మూడు మండలాల రైతులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

పటాన్‌చెరులో నేడు ఇఫ్తార్ విందు

పటాన్‌చెరు టౌన్: రంజాన్ నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైనారిటీ ఫంక్షన్ హాలులో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రోటోకాల్ చైర్మన్ డాక్టర్ పట్లోళ్ల ఆదిత్య రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు డివిజన్‌తో పాటు నియోజకవర్గంలోని ముస్లింలందరూ ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని కోరారు.

మురుగుతో పరేషాన్



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. చాలా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కరువై మురుగు నీరు రోడ్డుపైనే ఏరులై పారుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన వెంటనే ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. వారు గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని మల్కాపూర్‌లోని సంతోష్ నగర్, టీచర్స్ కాలనీలో మురుగు కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే పారుతూ ఫ్రెండ్స్ వెంచర్‌లోకి వచ్చి చేరుతోంది. దీంతో ఈ మూడు కాలనీల ప్రజలు ఆ వీధిలో తిరగాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం పై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాంరెడ్డి

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ అధ్వర్యంలో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నాగ్సాన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులు...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలో రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, నాయకులు ఆశిరెడ్డి, మోహన్, శేఖర్, భీంసేన్ రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, చింటూ గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గిజిగాడి గూడు భలేగుంది చూడు!



చెట్ల కొమ్మలకు వేలాడుతున్న పిచ్చుకల గూళ్లు

జహీరాబాద్ టౌన్: పక్షి కట్టే గూడు ప్రత్యేకమైంది. ఇంజినీరింగ్ నైపుణ్యానికి ఉదాహరణగా నిలుస్తోంది. శత్రువుల నుంచి గుడ్లు, పిల్లలను రక్షించడానికి సహాయపడుతాయి. గిజిగాళ్లు గూళ్లు చెట్ల కొమ్మలకు తీగలపై ఎక్కువగా నిర్మించుకుంటాయి. చాలా వరకు గూళ్లు ఒకే చోట చిన్న కాలనీలా కడుతుంటాయి. ఈ గూడులో పిచ్చుకలు గుడ్లు పెట్టి పిల్లలను పెంచుతాయి. అల్గోల్ పరిధిలో ఓ వ్యవసాయ పొలం వద్ద తుమ్మ చెట్టుకొమ్మలకు వేలాడుతున్న పిచ్చుకల గూళ్లు ఆకర్శిస్తున్నాయి.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం... గురువారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున, నలుగురికి రూ .1500 జరిమానా, ఐదుగురికి జరిమానాతో పాటు ముగ్గురికి రెండు రోజులు, ఇద్దరికీ మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డిలో 10 మందికి..

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించింది. సంగారెడి ట్రాఫిక్ సీఐ సుమాన్ కుమార్ కథనం ప్రకారం..గురువారం అర్ధరాత్రి పోతిరెడ్డిపల్లి, పాత బస్టాండ్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని శుక్రవారం సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ నలుగురికి రూ. 2వేలు, ఐదుగురికి రూ.1500, మిగతా ఒకరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపకూడదని, చట్టరీత్యా నేరమని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

న్యాల్‌కల్‌లో కిందకు వేలాడుతున్న తీగలు

- మరికొన్ని చోట్ల వంగిపోయి చువ్వలు తేలిన వైనం
- బలమైన గాలులు వీస్తే ప్రమాదాలు జరిగే అవకాశం
- విద్యుత్ అధికారులకు విన్నవించినా చర్యలు శూన్యం
- భయాందోళనకు గురవుతున్న రైతులు



మిర్జాపూర్(ఎన్) అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు పక్కన వంగిన విద్యుత్ స్తంభం



హద్నూర్ గ్రామ శివారులో వదులుగా ఉన్న తీగలు



కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల శివారులో గల విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో స్తంభాల పై భాగంలో సిమెంట్ పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారగా, మరి కొన్ని ప్రాంతాల్లో తీగలు కిందికి వేలాడుతూ కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఒక పక్కకు ఒరిగాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రమాదకరంగా మారిన స్తంభాలను బాగు చేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ సమస్యలకు కేరాఫ్..

మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్), హుస్సెల్లి, గుంజోటి, టేకూర్, తాట్‌పల్లి, న్యాల్‌కల్, ముంగి, రాఘవాపూర్, హుస్సేనగర్, రాజోల, మామడ్గి, శంశల్లాపూర్, వడ్డి తదితర గ్రామాల శివారులో గల విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. మిర్జాపూర్(ఎన్) గ్రామ శివారులో ఉన్న ఎల్‌టీ లైన్ స్తంభాలు ఒక పక్కకు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు పక్కన స్తంభం పక్కకు వంగింది. సిమెంట్ మొత్తం ఊడిపోయి కేవలం ఇనుప చువ్వలు తేలిపోయి దర్శనమిస్తున్నాయి. గుంజోటి గ్రామ శివారులో పొలంలో నిలబడితే తీగలు చేతికందేలా ఉన్నాయి. చాల్కి, రాఘవాపూర్ గ్రామాల శివారులో గల విద్యుత్ స్తంభాలు వంగిపోయి ఉన్నాయి. బలమైన గాలులు వీస్తే కూలే అవకాశం ఉందని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు వదులుగా ఉండి కిందకు వేలాడుతున్నాయి. బలమైన గాలులు వీచినప్పుడు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు ఎగసి పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలో పలువురు మృతి చెందారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.

పల్లె ప్రగతితో తొలగిన ఇబ్బందులు

గ్రామాల్లో చాలాకాలంగా విద్యుత్ సమస్యలు ఉండేవి. అవి పల్లె ప్రగతిలో దాదాపు తొలగిపోయాయి. గ్రామాల్లో వదులుగా ఉన్న తీగలను బాగు చేయడంతో పాటు పాడైపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా తొలగించారు. కాని పొలాల వద్ద ప్రమాదకరంగా మారిన వాటిని మాత్రం బాగు చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, వాటి తీగలను సరి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా తీగలు



గ్రామ శివారులో గల విద్యుత్ స్తంభాల తీగలు వదులుగా ఉండి ప్రమాదకరంగా మారాయి. వదులుగా ఉండటం వల్ల తీవ్ర భయాందోళనకు గురవుతున్నాం. బలమైన గాలులు వీస్తే ఒక దానికొకటి తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సందీప్ పటేల్, రైతు, గుంజోటి

బాగు చేయిస్తాం

వంగిపోయిన స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయిస్తాం. ఇప్పటి వరకు చాలా గ్రామాల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించడంతో పాటు వదులుగా ఉన్న తీగలను సరి చేయించాం. నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పొలాల వద్ద వదులుగా ఉన్న తీగలను కూడా బాగు చేయిస్తాం.

– అర్జున్, విద్యుత్ శాఖ ఏఈ, న్యాల్‌కల్

ప్రశాంతంగా పది పరీక్షలు

సంగారెడ్డి జోన్ బృందం : జిల్లాలో మొదటి రోజు పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థుల హాల్ టికెట్లను చెక్ చేసి పరీక్ష హాలులోకి పంపించారు. ఎగ్జామ్ కేంద్రాలను తహసీల్దార్లు, ఎంఈవోలు పరిశీలించారు. అధికారులు నిర్వాహకుల నుంచి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష సెంటర్ల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



హత్నూర(సంగారెడ్డి): హత్నూర పరీక్ష కేంద్రం వద్ద ..



పటాన్ చెరు టౌన్ : విద్యార్థుల హాల్ టికెట్ చెక్ చేసి లోనికి పంపుతున్న నిర్వాహకులు



జోగిపేట: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ..



పరీక్ష కేంద్రం వద్ద ఆర్డీఓ రవీందర్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సాయి హైస్కూల్ పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆర్డీఓ రవీందర్ రెడ్డి సందర్శించారు. పరీక్ష నిర్వాహకుల నుంచి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.